సాక్షి
శ్రీసత్యసాయి జిల్లా
గురువారం । 17 । ఏప్రిల్ । 2025



చీనీ టన్ను రూ.22 వేలు

అనంతపురం వ్యవసాయ మార్కెట్‌యార్డులో బుధవారం టన్ను చీనీ గరిష్టంగా రూ.22 వేలు, కనిష్టంగా రూ.3 వేల ప్రకారం ధర పలికాయి.



కొడిగెనహళ్లిలో భారీ చోరీ

పరిగి మండలం కొడిగెనహళ్లిలో భారీ చోరీ జరిగింది. తాళం వేసిన ఇంట్లో దూరిన దుండగులు 30 తులాల బంగారు ఆభరణాలను అపహరించారు. 8లో

గరిష్టం/కనిష్టం
41.1°/21.4°

జిల్లాలో బుధవారం గరిష్ట ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. భానుడి భగభగలతో వేసవితాపం కొనసాగుతోంది. గంటకు 8 నుంచి 10 కిలో మీటర్ల వేగంతో నైరుతి దిశగా గాలి వీచింది.

న్యూస్‌రీల్

మద్యం మత్తులో గొడవ

- ఇటుకతో బాదడంతో వ్యక్తి మృతి



మృతిచెందిన సుబ్బరాయప్ప

హిందూపురం: మద్యం మత్తులో ఇద్దరు వ్యక్తులు గొడవపడ్డారు. ఓ వ్యక్తి సహనం కోల్పోయి ఇటుక పెళ్లతో బాదడంతో సుబ్బరాయప్ప(65) అనే వ్యక్తి మృతిచెందాడు. ఈ ఘటన హిందూపురం మండలం గోళాపురం గుడ్డంపల్లిలో చోటుచేసుకుంది. వివరాలిలా ఉన్నాయి. గోళాపురం గుడ్డంపల్లి కర్ణాటక సరిహద్దున ఉండటంతో పాటు గ్రామంలో బెల్టుషాపులు నిర్వహిస్తుండడంతో విచ్చలవిడిగా మద్యం అమ్మకాలు సాగుతున్నాయి. ఈ క్రమంలోనే బంధువులైన సుబ్బరాయప్ప, నంజేగౌడ మంగళవారం పూటుగా మద్యం సేవించారు. ఒకచోట కూర్చొని మాట్లాడుకుంటున్న సమయంలో కుటుంబ విషయాలు ప్రస్తావనకు వచ్చాయి. దీంతో పరస్పరం వాగ్వాదానికి దిగారు. ఈ క్రమంలో సహనం కోల్పోయిన నంజేగౌడ ఇటుక పెళ్లతో సుబ్బరాయప్ప తలపై బలంగా కొట్టాడు. తీవ్ర గాయమైంది. అతన్ని బంధువులు హిందూపురం ప్రభుత్వాసుపత్రిలో చేర్చారు. పరిస్థితి విషమంగా మారడంతో రాత్రి మెరుగైన చికిత్స నిమిత్తం బెంగళూరుకు తీసుకెళ్లాలని వైద్యులు సూచించారు. ఈ మేరకు బెంగళూరుకు తరలిస్తుండగా మార్గమధ్యంలో చనిపోయాడు. హతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి.. దర్యాప్తు చేపడుతున్నట్లు హిందూపురం రూరల్ సీఐ ఆంజనేయులు తెలిపారు.


'కియా' ఇంజిన్ల దొంగల అరెస్ట్

- 8 మందిని రిమాండ్‌కు పంపిన పోలీసులు

పెనుకొండ: కియా కార్ల పరిశ్రమలో సుమారు 900 ఇంజిన్లను అపహరించిన దొంగలను పెనుకొండ పోలీసులు బుధవారం అరెస్ట్ చేసి..రిమాండ్‌కు తరలించారు. వివరాల్లోకి వెళితే... కియా కార్ల పరిశ్రమలో 900 ఇంజిన్లు మాయమైనట్లు యాజమాన్యం గుర్తించి పోలీసులకు ఫిర్యాదు చేసింది. దీంతో పోలీసులు ఈ కేసును ఛాలెంజింగ్‌గా తీసుకున్నారు. ఇంజిన్ల మాయం వెనుక ఇంటిదొంగలే ఉన్నట్లు గుర్తించారు. ఈ క్రమంలోనే గతంలో కియా కార్ల పరిశ్రమలో పని చేసిన పటాన్ సలీం, వినాయక మూర్తి, మణికంఠ, ఆర్ముగం, అర్జున్ తదితర ఎనిమిది మంది ఉద్యోగులను తమిళనాడులో అరెస్టు చేశారు. నిందితులను బుధవారం రాత్రి పెనుకొండ జడ్జి ఎదుట హాజరుపర్చి రిమాండ్‌కు తరలించారు. అనంతరం న్యాయమూర్తి అనుమతితో పోలీసులు నిందితులను కస్టడీకి తీసుకుని విచారణ చేయనున్నారు. నిందితులు దొంగలించిన కియా కార్ల ఇంజిన్లను పడవలు, చెరుకు రసం మిషన్ల కోసం విక్రయించినట్లు తెలిసింది. పోలీసు కస్టడీ అనంతరం పూర్తి వివరాలు తెలిసే అవకాశం ఉంది.

పండ్లను కృత్రిమంగా మాగబెడితే చర్యలు

- జాయింట్ కలెక్టర్ అభిషేక్ కుమార్ హెచ్చరిక



కార్బైడ్ రహిత పండ్ల వినియోగంపై సమీక్షిస్తున్న జాయింట్ కలెక్టర్ అభిషేక్ కుమార్

ప్రశాంతి నిలయం: ఇంకా పక్వానికి రాని పండ్లను కృత్రిమ రసాయనాలు వినియోగించి మాగబెట్టి విక్రయిస్తే కఠిన చర్యలు తప్పవని జాయింట్ కలెక్టర్ అభిషేక్ కుమార్ హెచ్చరించారు. బుధవారం ఆయన కలెక్టరేట్‌లోని తన చాంబర్‌లో 'ఆహార సంరక్షణ, ప్రమాణాల చట్టం-2006' అమలుపై సమీక్షించారు. ఈ సందర్భంగా జేసీ మాట్లాడుతూ.. మామిడి, అరటి, బొప్పాయి, దానిమ్మ పండ్లను క్యాల్షియం కార్బైడ్‌తోపాటు ఇతర హానికర రసాయనాలతో కృత్రిమంగా మాగబెట్టి విక్రయించడం వల్ల వాటిని తినే వారు రోగాల బారిన పడుతున్నారన్నారు. చిన్నారులు, వృద్ధులు ఎక్కువగా జీర్ణకోశ వ్యాధుల బారిన పడుతున్నారన్నారు. అందువల్ల ఎవరూ పండ్లను కృత్రిమంగా మాగబెట్టకూడదన్నారు. ఒక వేళ ఎవరైనా అలా చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. రూ.లక్ష వరకూ జరిమానా విధిస్తామని హెచ్చరించారు. ఎవరైనా పండ్లను రసాయనాలతో మాగబెడుతుంటే 9441463315 నంబరుకు ఫోన్ చేసి సమాచారం ఇవ్వాలని ప్రజలను కోరారు. సమావేశంలో ఫుడ్ సేఫ్టీ అధికారి రామచంద్ర, తస్లీమ, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి సుబ్బారావు, ఉద్యానశాఖ అధికారి చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.



సంస్కరణల ఫలితం చదువుల విప్లవం

సంకల్ప బలం ఉండాలే గానీ అసాధ్యాన్ని సుసాధ్యం చేయవచ్చని నిరూపించారు మాజీ సీఎం వైఎస్ జగన్. ఎంతో దూరదృష్టితో ఆనాడు ఆయన తీసుకున్న నిర్ణయాలు నేడు ఫలితాలను ఇస్తున్నాయి. 'నాడు-నేడు' పేరుతో రూ.కోట్లు ఖర్చు చేసి ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలలను కార్పొరేట్‌కు దీటుగా తీర్చిదిద్దారు. విద్యాబోధనలోనూ సమూల మార్పులు చేశారు. ఫలితంగా తాజా ఇంటర్ ఫలితాల్లో ప్రభుత్వ కళాశాలల విద్యార్థులు కార్పొరేట్ విద్యార్థులతో పోటీ పడి మార్కులు సాధించారు. స్టేట్ టాపర్లుగా నిలిచి సత్తా చాటారు.

'నాడు- నేడు'తో మారిన రూపురేఖలు

- జూనియర్ కళాశాలల్లో ఆధునిక సౌకర్యాలు
- విద్యాబోధనలోనూ సమూల మార్పులు
- కార్పొరేట్‌కు దీటుగా రాణించిన ఇంటర్ విద్యార్థులు
- స్టేట్ టాపర్ల జాబితాలో ఇద్దరికి చోటు
- వైఎస్ జగన్ పాలనను తలచుకుంటున్న తల్లిదండ్రులు

పుట్టపర్తి: ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థి ఫస్ట్‌క్లాస్‌లో పాసైతే ఒకప్పుడు పెద్దగొప్ప. కానీ నేడు ఆ పరిస్థితి మారింది. గత జగన్ సర్కార్ విద్యారంగంలో తీసుకువచ్చిన విప్లవాత్మక మార్పులతో ప్రభుత్వ కళాశాలల విద్యార్థులు కూడా ప్రైవేటు, కార్పొరేట్ కళాశాలల విద్యార్థులకు దీటుగా రాణిస్తున్నారు. 900కుపైగా మార్కులు సాధించి చరిత్ర లిఖిస్తున్నారు. ఏకంగా రాష్ట్ర మంత్రులతో సన్మానాలు అందుకుంటున్నారు.

రూ.కోట్ల ఖర్చుతో సకల సౌకర్యాలు

విద్యతోనే నిరుపేదల జీవితాల్లో వెలుగులు నిండుతాయని భావించిన మాజీ సీఎం వైఎస్ తన హయాంలో విద్యారంగంపై రూ.కోట్లు ఖర్చు చేశారు. ఖజానాపై భారం పడినా లెక్కచేయలేదు. పాఠశాలలు, జూనియర్ కళాశాలలను సమూలంగా మార్చేశారు. 2019-24 మధ్య కాలంలో 'నాడు- నేడు' కార్యక్రమం ద్వారా సకల సౌకర్యాలు కల్పించారు. జిల్లాలోని 21 ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో రూ.10 కోట్లకు పైగా ఖర్చు చేశారు. ఈ నిధులతో కళాశాలల్లో ఫర్నీచర్ మొదలు, డిజిటల్ క్లాస్‌రూం దాకా అన్ని సౌకర్యాలు కల్పించారు. అలాగే సైన్స్ ల్యాబ్‌లను ఆధునీకరించారు. దృశ్య, శ్రవణ పరికరాలనూ సమకూర్చారు. దీంతో విద్యార్థులకు ఇబ్బందులు లేకుండా పోయాయి. ఫలితంగా బాగా చదువుకుని ఫలితాల్లో సత్తా చాటారు.

టాపర్ల జాబితాలో ఇద్దరికి చోటు

ఇటీవల విడుదలైన ఇంటర్ ఫలితాల్లో జిల్లాకు చెందిన ఇద్దరు విద్యార్థులు టాపర్ల జాబితాలో చోటు దక్కించుకున్నారు. కొత్తచెరువు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో సీనియర్ ఇంటర్ (హెచ్‌ఈసీ) చదువుతున్న హోం గార్డ్ కుమార్తె నీరుగంటి హరిత 1000 మార్కులకు గాను 851 మార్కులు సాధించింది. అలాగే హిందూపురానికి చెందిన నీరుగంటి వాణి (ఒకేషనల్) 1000 మార్కులకు 978 మార్కులు సాధించి ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులు ఎందులోనూ తీసిపోరని నిరూపించారు. వీరికి రెండురోజుల క్రితం విజయవాడలో జరిగిన కార్యక్రమంలో రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ ప్రతిభా పురస్కారం అందించి సత్కరించారు.



నాడు-నేడు పనులతో అందుబాటులోకి వచ్చిన డిజిటల్ తరగతి గదిలో పాఠాలు వింటున్న విద్యార్థులు

నాటి సంస్కరణలు.. నేటి ఫలితాలు

వైఎస్ జగన్ నాటిన చదువుల విత్తనం చెట్టుగా మారి నేడు ఫలాలు ఇస్తోందని, ప్రస్తుతం ఇంటర్ విద్యార్థులు సాధించిన మార్కులే ఇందుకు నిదర్శనమని విద్యావేత్తలు అభిప్రాయపడుతున్నారు. రెండేళ్లుగా ఇంటర్ ఉత్తీర్ణత శాతం పెరుగుతోంది. ఈ విద్యాసంవత్సరం జిల్లాలోని 21 ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో ప్రథమ, ద్వితీయ సంవత్సరం విద్యార్థులు 7,910 మంది ఉండగా, ఈ ఏడాది ద్వితీయ సంవత్సరం విద్యార్థులు 72 శాతం మంది ఉత్తీర్ణత సాధించడం గమనార్హం.

చాలా ఆనందంగా ఉంది



నీరుగంటి వాణికి బహుమతి అందజేస్తున్న మంత్రి నారా లోకేష్

ప్రభుత్వ జూనియర్ కళాశాలలో చదివిన నేను 978 మార్కులు సాధించాను. స్టేట్ టాపర్ల సరసన నిలవడం ఆనందంగా ఉంది. రెండు, మూడేళ్లుగా జూనియర్ కళాశాలల్లో సౌకర్యాలు బాగా మెరుగుపడ్డాయి. అధ్యాపకులు కూడా బాగా బోధిస్తున్నారు. 'నాడు-నేడు' పనులతో మా కళాశాల రూపురేఖలు మారాయి. ప్రోత్సహిస్తే ప్రభుత్వ కళాశాలల విద్యార్థులు కూడా సత్తా చాటుతారనేందుకు నేనే ఉదాహరణ.

– నీరుగంటి వాణి,
హిందూపురం జూనియర్ కళాశాల

ఇబ్బందులు లేవు.. అందుకే రాణించా



లోకేశ్ చేతుల మీదుగా పురస్కారం అందుకుంటున్న నీరుగంటి హరిత

నేను ఇంటర్‌లో హెచ్‌ఈసీ చదివాను. ఇటీవల వచ్చిన ఫలితాల్లో 851 మార్కులు సాధించాను. మా కళాశాలలో సౌకర్యాలు చాలా బాగున్నాయి. మాకు ఎలాంటి ఇబ్బంది లేకపోవడంతో చదువుపై దృష్టి సారించగలిగాను. అందుకే ప్రైవేటు కళాశాలల విద్యార్థులకు దీటుగా రాణించాను. అధ్యాపకులు, తల్లిదండ్రులు కూడా ప్రోత్సహించారు. ప్రభుత్వ విద్య బలోపేతం చేసేందుకు కృషి చేసిన వారందరికీ ధన్యవాదాలు.

– నీరుగంటి హరిత,
కొత్తచెరువు జూనియర్ కళాశాల

వేరుశనగకు రూ.38 వేలు

- 10 నుంచి 20 శాతం పెరిగిన స్కేల్ ఆఫ్ ఫైనాన్స్
- బ్యాంకుల్లో ప్రారంభమైన పంట రుణాల రెన్యూవల్స్



వేరుశనగ పంట

అనంతపురం అగ్రికల్చర్: ఈ ఏడాది వేరుశనగ ఎకరాకు రూ.38 వేల ప్రకారం పంట రుణాలు ఇవ్వాలని బ్యాంకర్లకు ఆదేశాలు వచ్చాయి. ఖరీఫ్, రబీలో పంటల వారీగా రైతులకు ఎంత మొత్తంలో రుణాలు ఇవ్వాలనే దానిపై గరిష్ట రుణ పరిమితి (స్కేల్ ఆఫ్ ఫైనాన్స్) ఖరారైనట్లు బ్యాంకర్లు తెలిపారు. గతేడాది కన్నా పంట పెట్టుబడులను బట్టి 10 నుంచి 20 శాతం పెంచారు. జిల్లాలోని బ్యాంకుల్లో రైతులకు సంబంధించి ఖరీఫ్ పంట రుణాల రెన్యూవల్స్, కొత్త రుణాల పంపిణీ ప్రారంభమైనట్లు బ్యాంకర్లు చెబుతున్నారు. స్కేల్ ఆఫ్ ఫైనాన్స్‌కు అదనంగా 15 శాతం అధికంగా ఇచ్చే వెసులుబాటు కల్పించినట్లు సమాచారం.

పంటల వారీగా ఇలా:

వర్షాధారంగా సాగు చేసే వేరుశనగ ఎకరాకు రూ.38 వేలు, నీటి వసతి కింద అయితే రూ.41 వేలు ప్రకారం పంట రుణం ఇవ్వనున్నారు. కంది పంట వర్షాధారంగా ఎకరాకు రూ.29 వేలు, నీటి వసతి కింద రూ.30 వేలు, ఆముదం రూ.22 వేలు, పప్పుశనగ రూ.37 వేలు, పత్తి రూ.51 వేల నుంచి రూ.55 వేలు, విత్తనోత్పత్తి పత్తి రూ.1.60 లక్షలు, వరి రూ.52 వేలు, విత్తన వరి రూ.55 వేలు, జొన్న రూ.25 వేలు, రాగి రూ.22 వేల నుంచి రూ.25 వేలు, సజ్జ రూ.21 వేల నుంచి రూ.24 వేలు, కొర్ర రూ.17 వేల నుంచి రూ.21 వేలు, వర్షాధారంగా మొక్కజొన్న రూ.31 వేలు, నీటి వసతి కింద రూ.47 వేలు, విత్తన మొక్కజొన్నకు రూ.50 వేలుగా నిర్ణయించారు.

ఉద్యాన, కూరగాయల పంటలకు..

పచ్చిమిరపకు రూ.1.10 లక్షలు, ఎండుమిరప రూ.1.75 లక్షలు, టమాట ట్రెల్లీస్ లేకుండా రూ.41 వేలు, ట్రెల్లీస్ టమాట రూ.65 వేలు, హైబ్రీడ్ టమాట రూ.78 వేలు, ట్రెల్లీస్ హైబ్రీడ్ టమాట రూ.1.25 లక్షలు, వంకాయ రూ.54 వేలు, హైబ్రీడ్ వంకాయ రూ.67 వేలు, బెండ రూ.36 వేలు, హైబ్రీడ్ బెండ రూ.50 వేలు, ఉల్లి రూ.60 వేలు, మునగ రూ.49 వేలు, వర్షాధారంగా బేబీకార్న్‌కు రూ.28 వేలు, నీటి వసతి కింద రూ.44 వేలు, కరివేపాకు రూ.60 వేలు, ధనియాలు రూ.24 వేలు, సోయాబీన్స్ రూ.17 వేలు, అరటి ఎకరా రూ.1.10 లక్షలు, టిష్యూ కల్చర్ అరటి రూ.1.36 లక్షలు, దానిమ్మ రూ.1.60 లక్షలు, చీనీ రూ.71 వేలు, నిమ్మ రూ.85 వేలు, బొప్పాయి రూ.1.20 లక్షలు, మామిడి రూ.55 వేలు, సపోట రూ.43 వేలు, ద్రాక్ష రూ.1.25 లక్షలు, రేగు రూ.34 వేలు, కళింగర రూ.54 వేలు, దోస రూ.66 వేలు, జామ రూ.55 వేలు, అంజూర రూ.42 వేలు, సీతాఫలం రూ.27 వేలు, డ్రాగన్‌ఫ్రూట్ రూ.77 వేలు, చింత రూ.27 వేలు, కొబ్బరి రూ.70 వేలు, మల్లెపూల తోటల సాగుకు రూ. లక్ష, రోజాపూలు రూ.43 వేల నుంచి రూ.66 వేలు, బంతిపూలు రూ.55 వేలు, చామంతి రూ.60 వేలు, కనకాంబరాలు రూ.39 వేలు, గడ్డి సాగు రూ.36 వేలు, మల్బరీ సాగుకు రూ.1.20 లక్షల మేర స్కేల్ ఆఫ్ ఫైనాన్స్ ఖరారు చేశారు.

జగన్‌ను ఎదుర్కోలేకే కూటమి కుట్రలు

- వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షురాలు ఉషశ్రీచరణ్



సమావేశంలో మాట్లాడుతున్న వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షురాలు ఉషశ్రీ చరణ్

సోమందేపల్లి: వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి ప్రజల్లో ఉన్న ఆదరణచూసి ఓర్వలేక, ఆయన్ను ఎదుర్కొనే ధైర్యం లేక కూటమి ప్రభుత్వం కుట్రలు చేస్తోందని మాజీ మంత్రి, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షురాలు ఉషశ్రీచరణ్ అన్నారు. బుధవారం ఆమె సోమందేపల్లిలో విలేకరులతో మాట్లాడారు. టీడీపీ నాయకుల చేతిలో హత్యకు గురైన కురుబ లింగమయ్య కుటుంబాన్ని పరామర్శించడానికి ఈనెల 8న వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వస్తే పోలీసులు భద్రత కల్పించలేకపోయారన్నారు. ప్రజాభిమానం మెండుగా ఉన్న నాయకుడు కాబట్టే అభిమానులు భారీగా తరలివచ్చారన్నారు. హెలిప్యాడ్ వద్ద పోలీసులు సరైన చర్యలు తీసుకోకపోవడం వల్లే అభిమానులు చుట్టుముట్టారని, ఈ క్రమంలోనే హెలికాప్టర్ విండ్ షీల్డ్ దెబ్బతినిందన్నారు. తమ తప్పును కప్పిపుచ్చుకునేందుకు కూటమి ప్రభుత్వం.. ఆ నెపాన్ని ఇతరులపై తోసివేసేందుకు సిద్ధమైందన్నారు. ఈ క్రమంలోనే విచారణ పేరుతో పైలెట్లను రప్పించిందన్నారు. వైఎస్ జగన్ రాష్ట్రంలో పర్యటించకుండా కట్టడి చేసేందుకు ప్రైవేట్ ఛాపర్ యజమానులను బెదిరిస్తోందని ఆరోపించారు. ఎన్ని కుట్రలు చేసినా... జన సునామీని ఆపలేరన్నారు. సనాతన ధర్మ పరిరక్షకుడని చెప్పుకుంటున్న డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ తిరుపతిలో గోమాతల మృతిపై ఎందుకు స్పందించలేదన్నారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిపై టీడీపీ శ్రేణులు అసభ్యకరంగా మాట్లాడితే వారిని వదిలి... ప్రశ్నించిన వారిపై కక్షగట్టి అక్రమ కేసులు బనాయించడం దుర్మార్గమన్నారు. హిందూపురం నియోజకవర్గ నాయకుడు వేణురెడ్డితో పాటు మరికొందరు వైఎస్సార్ సీపీ నేతలను అక్రమంగా అరెస్ట్ చేసి పరిగి పోలీస్ స్టేషన్‌కు తరలించడంపై ఆమె ఆగ్రహం వ్యక్తం చేశారు. సమావేశంలో వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ గజేంద్ర, జెడ్పీటీసీ సభ్యుడు అశోక్, సర్పంచ్ అంజినాయక్, పట్టణ అధ్యక్షుడు శ్రీనివాసులు, ఉపాధ్యక్షుడు మంజు, సింగిల్ విండో చైర్మన్లు ఆదినారాయణ రెడ్డి, సూర్యప్రకాష్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

తపాలా ఎస్పీగా రాజేష్

అనంతపురం సిటీ: అనంతపురం డివిజన్ తపాలా సూపరింటెండెంట్‌గా రాజేష్ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. కడప డివిజన్ రెగ్యులర్ సూపరింటెండెంట్‌గా కొనసాగుతున్న ఆయనను అనంతపురం డివిజన్ ఇన్‌చార్జ్ బాధ్యతలు అప్పగిస్తూ ఇటీవల ఆ శాఖ ఉన్నతాధికారులు ఉత్తర్వులు జారీ చేసిన సంగతి తెలిసిందే. కాగా, ఇప్పటి వరకూ ఆ స్థానంలో కొనసాగిన గుంపస్వామిని ఉన్నతాధికారులు ఆదిలాబాద్ డివిజన్‌కు బదిలీ చేయగా బుధవారం రాత్రి ఆయన రిలీవ్ అయ్యారు.

పరిశ్రమల స్థాపనతోనే ఆర్థిక ప్రగతి

- జిల్లాలో పారిశ్రామిక రంగాన్ని పటిష్టం చేయాలి
- అధికారులకు కలెక్టర్ టీఎస్ చేతన్ ఆదేశం



పారిశ్రామిక ప్రగతిపై సమీక్షిస్తున్న కలెక్టర్ టీఎస్ చేతన్

ప్రశాంతి నిలయం: పరిశ్రమల స్థాపనతోనే ఆర్థిక ప్రగతి సాధ్యమవుతుందని, అందువల్ల ఔత్సాహిక పారిశ్రామిక వేత్తలకు తగిన సహకారం అందించి పారిశ్రామిక రంగాన్ని పటిష్టం చేయాలని కలెక్టర్ టీఎస్ చేతన్ ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్‌లోని పీజీఆర్ఎస్ సమావేశ మందిరంలో జిల్లా పరిశ్రమలు, ఎగుమతుల ప్రోత్సాహక కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లాలో పారిశ్రామిక ప్రగతిపై సమీక్షించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ... జిల్లాలో పరిశ్రమల స్థాపనకు అనువైన వాతావరణం ఉందన్నారు. పరిశ్రమల స్థాపనకు ముందుకు వచ్చే వారికి అన్ని విధాలా సహాయ సహకారాలు అందించాలన్నారు. పారిశ్రామిక అభివృద్ధిపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టిసారించిందన్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న నూతన పారిశ్రామిక పాలసీకి అనుగుణంగా జిల్లా ఆర్థిక అభివృద్ధికి దోహదపడేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఔత్సాహిక పారిశ్రామికవేత్తలను ప్రోత్సహిస్తూ యువతకు స్థానికంగానే ఉపాధి అవకాశాలు కల్పించేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. పరిశ్రమల స్థాపన కోసం అందిన దరఖాస్తుల్లో పెండింగ్‌లో ఉన్న వాటిని వెంటనే పరిశీలించి ఆమోదం తెలపాలన్నారు. కర్మాగారాల్లో భద్రతా ప్రమాణాలు పాటించాలని, ప్రమాదాలు జరగకుండా చర్యలు తీసుకోవాలన్నారు. ప్రతి మూడు నెలలకు ఒకసారి సమావేశం నిర్వహించాలని పరిశ్రమల శాఖ డిప్యూటీ చీఫ్ ఇన్‌స్పెక్టర్ కృష్ణమూర్తిని ఆదేశించారు. అనంతరం జిల్లాలో సీఎస్ఆర్ కార్యకలాపాలను సమీక్షించారు. సమావేశంలో పరిశ్రమల శాఖ జనరల్ మేనేజర్ నాగరాజు, ఏపీఐఐసీ జోనల్ మేనేజర్ సోనీ సహాని, డీపీఓ సమత, ఎల్డీఎం రమణకుమార్, పరిశ్రమల శాఖ అధికారి కె.కృష్ణమూర్తి, జిల్లా అగ్నిమాపక శాఖ అధికారి హేమంత్‌రెడ్డి, సీపీఓ విజయ్‌కుమార్, నాబార్డ్ అధికారి అనురాధ, గ్రామ/వార్డు సచివాలయాల నోడల్ అధికారి సుధాకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

'మన మిత్ర'పై అవగాహన కల్పించాలి

వాట్సాప్ గవర్నెన్స్‌పై ప్రజలకు అవగాహన కల్పించేందుకు ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించాలని కలెక్టర్ టీఎస్ చేతన్ అధికారులను ఆదేశించారు. వాట్సాప్ గవర్నెన్స్‌పై ప్రజలకు అవగాహన కల్పించేందుకు రూపొందించిన వాల్‌పోస్టర్లను కలెక్టర్‌కు బుధవారం కలెక్టరేట్‌లోని పీజీఆర్ఎస్ సమావేశ మందిరంలో విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... రాష్ట్ర ప్రభుత్వం 'మన మిత్ర' పేరిట వాట్సాప్ గవర్నెన్స్‌ను అమల్లోకి తెచ్చిందన్నారు. దీని ద్వారా ప్రస్తుతం 210 సేవలు అందిస్తోందన్నారు. రానున్న రోజుల్లో 350 సేవలు అందుబాటులోకి వస్తాయన్నారు. ఈ సేవలు ప్రజలు వినియోగించుకునేలా అవగాహన కల్పించాలన్నారు. ఇందుకోసం ఏప్రిల్ 15 నుంచి 'ప్రతి ఇంటికి మన మిత్ర' కార్యక్రమం నిర్వహించాలన్నారు. ప్రతి పౌరుడి ఫోన్‌లో 9552300009 నంబర్ సేవ్ చేయించాలన్నారు. పౌరులకు కావాల్సిన ధ్రువపత్రాలు కూడా వాట్సాప్ ద్వారా పొందే అవకాశం ఉందన్నారు.

చౌడేశ్వరీ నమోస్తుతే

- కనుల పండువగా జ్యోతుల ఉత్సవం
- వివిధ ప్రాంతాల నుంచి భారీగా తరలివచ్చిన భక్తులు





చౌడేశ్వరీ దేవి పూల పల్లకీ ఉత్సవం(ఇన్‌సెట్‌లో) అమ్మవారి జ్యోతిని తీసుకువస్తున్న దృశ్యం

అమడగూరు: చల్లని తల్లి చౌడేశ్వరమ్మ జ్యోతుల వెలుగుల్లో ఊరేగుతూ భక్తులకు దర్శనమిచ్చారు. అమడగూరులో వెలసిన చౌడేశ్వరీదేవి వార్షిక ఉత్సవాల్లో భాగంగా బుధవారం ఆలయ ధర్మకర్త, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు పొట్టా పురుషోత్తమరెడ్డి కుటుంబ సభ్యుల ఆధ్వర్యంలో జ్యోతి మహోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. జ్యోతి ఉత్సవంలో అమ్మవారిని దర్శించుకుంటే అంతా శుభమే జరుగుతుందని భక్తుల నమ్మకం. దీంతో కర్ణాటక, తమిళనాడు, కేరళ రాష్ట్రాలనుంచి భక్తులు భారీగా తరలివచ్చి అమ్మవారి దర్శనం చేసుకున్నారు. ఉత్సవాల సందర్భంగా ఆలయాన్ని విద్యుత్ దీపాలతో, అమ్మవారిని మల్లెపూలతో ప్రత్యేకంగా అలంకరించారు.

జ్యోతిదర్శనంతో పులకించిన భక్తజనం

ఉత్సవంలో భాగంగా తొలుత అమ్మవారి విగ్రహాన్ని పూలపల్లకీపై కొలువుదీర్చి ఆలయం నుంచి గ్రామ నడిబొడ్డున ఉన్న ఉట్టి వరకూ ఊరేగింపుగా తీసుకువచ్చారు. అక్కడ ప్రత్యేక పూజల అనంతరం అమ్మవారి పల్లకీ ముందు జ్యోతిని రగిలించారు. జ్యోతి ముందు వెళ్తుండగా...ఆ వెలుగుల్లో అమ్మవారు భక్తులను దర్శనమిచ్చారు. ఈ క్రమంలో జ్యోతిని చూడటానికి భక్తులు ఎగబడ్డారు. డప్పు, మంగళ వాయిద్యాలు, బాణాసంచా పేలుళ్ల మధ్య యువకులు చిందులేస్తూ ఆడి, పాడారు. భక్తుల కాలక్షేపం కోసం ఏర్పాటు చేసిన కోలాటలు, భజనలు, హరికథలు తదితర సాంస్కృతిక కార్యక్రమాలు అందరినీ ఆకట్టుకున్నాయి. ఉత్సవాల్లో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా పోలీసులు బందోబస్తు నిర్వహించారు. చీకిరేవులపల్లి యూత్ సభ్యులు భక్తులకు అన్నదానం చేశారు. ఉత్సవాల్లో భాగంగా అమ్మవారు గురువారం అశ్వవాహనంపై భక్తులకు దర్శనమివ్వనున్నారు.

అంతర జిల్లా చైన్‌స్నాచర్ల అరెస్ట్

- రూ.32.40 లక్షల విలువ చేసే 36 తులాల బంగారం, నగదు, మూడు బైక్‌ల స్వాధీనం
- వ్యసనాలతో అప్పులపాలై చైన్‌స్నాచర్లుగా మారిన యువకులు



స్వాధీనం చేసుకున్న సొత్తును చూపుతున్న అనంతపురం జిల్లా ఎస్పీ జగదీష్, పోలీసు అధికారులు

అనంతపురం: ఒంటరిగా వెళ్లే మహిళల్ని టార్గెట్ చేసి వారి మెడలోని బంగారు గొలుసులను లాక్కొని ఉడాయించే అంతర జిల్లా చైన్‌స్నాచర్ల ముఠాను పోలీసులు అరెస్ట్ చేశారు. వీరి నుంచి మొత్తం రూ.32.40 లక్షల విలువ చేసే 36 తులాల బంగారం, నగదు, మూడు బైక్‌లను స్వాధీనం చేసుకున్నారు. పట్టుబడిన వారిలో అనంతపురం శివారులోని రాజీవ్ కాలనీకి చెందిన కె.పంపాచారి అలియాస్ నరేష్, రాయల్ నగర్‌కు చెందిన షేక్ షాకీర్, ప్రియాంకనగర్ నివాసి షేక్ ఫజిల్ అహమ్మద్ అలియాస్ షేక్ ఫజిజ్ అహమ్మద్, శ్రీ సత్యసాయి జిల్లా నల్లమాడ నివాసి కంబం నాగార్జున అలియాస్ చిన్నా ఉన్నారు. బుధవారం డీపీఓలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వివరాలను అనంతపురం జిల్లా ఎస్పీ పి.జగదీష్ వెల్లడించారు.

అందరూ 24 నుంచి 30 ఏళ్ల లోపు వారే

పట్టుబడిన నిందితులందరూ 24 నుంచి 30 ఏళ్ల లోపు వారే కావడం గమనార్హం. కె.పంపాచారి కార్పెంట్ వృత్తితో పాటు డ్రైవింగ్ చేస్తూ కుటుంబాన్ని పోషించుకునేవాడు. పేకాట, క్రికెట్ బెట్టింగ్‌లకు అలవాటు పడి సంపాదన మొత్తం వ్యసనాలకే ఖర్చు పెట్టేవాడు. ఇతనికి నాలుగు నెలల క్రితం కంబం నాగార్జున పరిచయమయ్యాడు. నాగార్జున సొంతూరు శ్రీసత్యసాయి జిల్లా నల్లమాడ కాగా, ఏడాదిన్నర క్రితం కుటుంబంతో సహా అనంతపురానికి వలస వచ్చి సుఖ్‌దేవ్‌నగర్‌లో నివాసముంటున్నాడు. డ్రైవర్‌గా పనిచేస్తూ కుటుంబాన్ని పోషించుకునేవాడు. పంపాచారి పరిచయమైన తర్వాత ఇద్దరూ కలిసి పేకాట, ఆన్‌లైన్ జూదం ఆడుతూ సంపాదన మొత్తం పోగొట్టుకుని అప్పుల పాలయ్యారు. రాయల్ నగర్‌కు చెందిన షేక్ షాకీర్... కార్పెంటర్‌గా పని చేసేవాడు. ఈ క్రమంలో సొంతంగా ఓ ఫర్నీచర్ షాప్ ఏర్పాటు చేసుకుని అప్పుల పాలయ్యాడు. అప్పులు తీర్చే మార్గం కోసం అన్వేషిస్తుండగా పంపాచారి, నాగార్జున పరిచయమయ్యారు. ముగ్గురు కలిసి వ్యక్తిగత అవసరాలకు, అప్పులు తీర్చేందుకు చైన్‌స్నాచింగ్‌లకు సిద్ధమయ్యారు. అనంతరం వీరందరూ కలిసి బృందాలుగా విడిపోయి చైన్‌స్నాచింగ్‌కు పాల్పడేవారు. ప్రైవేట్ వాహన డ్రైవర్‌గా పనిచేస్తున్న షేక్ ఫజిల్ అహమ్మద్ సైతం ఆన్‌లైన్ బెట్టింగ్, పేకాట తదితర వ్యసనాలకు బానిసై అప్పుల పాలయ్యాడు. అప్పులు ఇచ్చిన వారి నుంచి ఒత్తిళ్లు ఎక్కువ కావడంతో పాటు ఇటీవల పెళ్లి సంబంధం కూడా ఖాయమైంది. పెళ్లి ఖర్చులకు డబ్బు లేకపోవడంతో చైన్‌స్నాచర్‌గా మారాడు.

ఒంటరిగా వెళ్లే మహిళలే లక్ష్యంగా..

పంపాచారి ద్విచక్ర వాహనంపై ఒక్కడే వెళుతూ శివారు కాలనీలు, నిర్మానుష్య ప్రాంతాల్లో ఒంటరిగా వెళ్తున్న మహిళల మెడలోని బంగారు నగలను లాక్కొని అదే టూవీలర్‌పై ఉడాయించేవాడు. 2023 నుంచి కురుగుంట, మన్నీల, రాప్తాడు, అనంతపురంలోని కళ్యాణదుర్గం రోడ్డు, గణేష్ నగర్, లలితానగర్, ఒకటో రోడ్డు, తదితర ప్రాంతాల్లో 10 చైన్ స్నాచింగ్‌లు చేశాడు. అనంతరం షేక్ షాకీర్‌తో కలిసి బైక్‌పై వెళుతూ కళ్యాణదుర్గం రోడ్డు, ద్వారకా విల్లాస్‌లో రెండు స్నాచింగ్‌లు, కంబం నాగార్జునతో కలిసి హెచ్చెల్సీ రోడ్డు, స్టాలిన్ నగర్, బుక్కరాయసముద్రం, బి.కొత్తపల్లి గ్రామాల్లో నాలుగు స్నాచింగ్‌లు చేశాడు. మొత్తం 16 కేసుల్లో పంపాచారి నిందితుడు. ఇందులో రెండు కేసుల్లో షేక్ షాకీర్, నాలుగు కేసుల్లో కంబం నాగార్జున నిందితులుగా ఉన్నారు. షేక్ ఫజిల్ అహమ్మద్ ఎవరూ గుర్తుపట్టకుండా తలకు ఎరుపు రంగు క్యాప్ పెట్టుకుని, ముఖానికి ఖర్చీఫ్ కట్టుకుని చైన్‌స్నాచింగ్‌లకు పాల్పడేవాడు. అనంతపురంలోని శ్రీశ్రీ నగర్, హెచ్చెల్సీపై ఒంటరిగా వెళ్తున్న సచివాలయ మహిళా ఉద్యోగిని వెంబడించి ఆమె మెడలో ఉన్న బంగారు చైన్ అపహరణ, ఇతర మూడు కేసుల్లో నిందితుడుగా ఉన్నాడు. నిందితులు నలుగురూ పోలీసులకు వేర్వేరుగా పట్టుబడ్డారు. చైన్‌స్నాచర్ల అరెస్ట్‌లో చొరవ చూపిన అనంతపురం రూరల్ సీఐ ఎస్.శేఖర్, నాల్గో పట్టణ సీఐ కె.సాయినాథ్, సీసీఎస్ సీఐలు ఇస్మాయిల్, జయపాల్‌రెడ్డి, ఎస్‌బీ ఎస్‌ఐ రాజశేఖర్‌రెడ్డి, రూరల్ ఎస్‌ఐ కె.రాంబాబును ఎస్పీ జగదీష్ అభినందించారు.

క్లుప్తంగా

కొడిగెనహళ్లిలో భారీ చోరీ

- ఇంట్లో ఎవరూ లేని సమయంలో ప్రవేశించిన దుండగులు
- 30 తులాల బంగారం అపహరణ


చోరీ జరిగిన ఇంటిని పరిశీలిస్తున్న డీఎస్పీ నర్సింగప్ప

పరిగి: మండలంలోని కొడిగెనహళ్లిలో భారీ చోరీ జరిగింది. వివరాలు.. కొడిగెనహళ్లి విద్యానగర్‌లో నివాసముంటున్న శంకరప్ప గత శనివారం ఇంటికి తాళం వేసి తన కుటుంబసభ్యులతో కలసి కర్ణాటకలోని కుక్కే సుబ్రహ్మణ్య స్వామి ఆలయానికి వెళ్లాడు. తాళం వేసిన ఇంటిని గమనించిన దుండగులు మంగళవారం అర్ధరాత్రి దాటిన తర్వాత ఇంట్లోకి చొరబడ్డారు. ఈ దృశ్యాలు సీసీ కెమెరా ఫుటేజీల్లో నిక్షిప్తమయ్యాయి. బుధవారం ఉదయం ఇంటికి చేరుకున్న శంకరప్ప.. తలుపులు తీసి ఉండడం గమనించి నివ్వెరపోయాడు. వాకిళ్లను ధ్వంసం చేసి, లోపల ఉన్న బీరువాల్లోని 30 తులాల బంగారంతో పాటు రూ.40 వేల నగదును అపహరించుకెళ్లినట్లుగా గుర్తించి, సమాచారం ఇవ్వడంతో డీఎస్పీ నర్సింగప్ప, ఎస్‌ఐ రంగడు, సిబ్బంది అక్కడకు చేరుకుని పరిశీలించారు. శంకరప్ప ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

ఏరియా ఆస్పత్రి వైద్యుల అవినీతిపై విచారణ


గైనకాలజిస్టుల అవినీతిపై విచారణ చేస్తున్న ప్రత్యేక వైద్య బృందం

కదిరి అర్బన్: స్థానిక ఏరియా ఆస్పత్రిలో పనిచేస్తున్న ఇద్దరు గైనకాలజిస్టుల అవినీతిపై బుధవారం ప్రత్యేక వైద్యాధికారుల బృందం విచారణ చేపట్టింది. బృందంలో కర్నూలుకు చెందిన డాక్టర్ మాధవీలత, విజయవాడ డీసీహెచ్ వెంకట్రామయ్య, నంద్యాల ఏఓ శైలాజాదేవి ఉన్నారు. ఫిర్యాదుదారుడిని పిలిపించి గత నెల 7న వారికి జరిగిన అన్యాయంపై రాతపూర్వక విశ్లేషణను తీసుకున్నారు. అలాగే బాధితునితో పాటు ఆరోపణలు ఎదుర్కొంటున్న ఇద్దరు డాక్టర్లను వేర్వేరుగా విచారించారు. విచారణ నివేదికను రూపొందించి ఉన్నతాధికారులకు పంపించనున్నట్లు ఈ సందర్భంగా వారు తెలిపారు. కాగా, గైనకాలజిస్టుల అవినీతిపై విచారణ జరుగుతున్న సమయంలోనే స్థానిక సీపీఎం నేతలు అక్కడకు చేరుకుని ఆస్పత్రిలో స్కానింగ్ యంత్రాలున్నా.. కమీషన్ల కోసం ప్రైవేట్ దయాగ్నస్టిక్ సెంటర్లకు రెఫర్ చేస్తున్న గైనకాలజిస్టులపై చర్యలు తీసుకోవాలంటూ విచారణ బృందానికి వినతిపత్రం సమర్పించారు. వినతిపత్రం సమర్పించిన వారిలో సీపీఎం పట్టణాధ్యక్షుడు జీఎం నరసింహులు, నాయకులు ముస్తాక్, రామ్మోహన్ ఉన్నారు.

ప్రజారోగ్యాన్ని అశ్రద్ధ చేయొద్దు

- పరిగి, ఊటుకూరు పీహెచ్‌సీలను తనిఖీ చేసిన డీఎంహెచ్‌ఓ
- కొడిగెనహళ్లి ఏపీఆర్‌ఎస్‌లో భోజన గది పరిశీలన


పరిగి పీహెచ్‌సీలో ల్యాబ్‌ను పరిశీలిస్తున్న డీఎంహెచ్‌ఓ ఫైరోజ్‌బేగం

పరిగి: ప్రజారోగ్యంపై అశ్రద్ధ వహించకుండా సకాలంలో నాణ్యమైన వైద్య సేవలు అందించాలని సిబ్బందిని వైద్య, ఆరోగ్యాధికారి డాక్టర్ ఫైరోజ్ బేగం ఆదేశించారు. బుధవారం పరిగి మండలంలో ఆమె విస్తృతంగా పర్యటించారు. తొలుత స్థానిక పీహెచ్‌సీని పరిశీలించారు. పలు రిజిస్టర్లు తనిఖీ చేశారు. ఎండాకాలంలో వడదెబ్బ బారిన పడిన వారికి అందిస్తున్న చికిత్సలపై ఆరా తీశారు. వైద్యులు, సిబ్బంది సకాలంలో ఆస్పత్రిలో రోగులకు అందుబాటులో ఉండాలన్నారు. అనంతరం ఊటుకూరులో నూతనంగా ఏర్పాటైన పీహెచ్‌సీని తనిఖీ చేశారు. అలాగే కొడిగెనహళ్లిలోని ఏపీఆర్‌ఎస్ పాఠశాలను తనిఖీ చేశారు. మధ్యాహ్న భోజన నాణ్యతను పరిశీలించారు. విద్యార్థులకు శుచి, శుభ్రతతో కూడిన నాణ్యమైన భోజనాన్ని అందించడంతో పాటు పాఠశాల పరిసరాల పరిశుభ్రతకు ప్రాధాన్యమివ్వాలని ఉపాధ్యాయులకు సూచించారు. దోమకాటు జబ్బుల వ్యాప్తిని అరికట్టేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో మెడికల్ ఆఫీసర్లు డాక్టర్ స్వరూపరెడ్డి, నవీన, సురేష్, రూబీ, సీహెచ్‌ఓ వన్నప్ప, పీహెచ్‌ఎన్ వెంకమ్మ, వైద్యారోగ్య శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

మహిళ హత్య కేసులో వీడిన మిస్టరీ


నిందితులను అరెస్ట్ చూపుతున్న పోలీసులు

ధర్మవరం రూరల్: మండలంలోని రేగాటిపల్లి పొలాల్లో గత నెల 16న దారుణ హత్యకు గురైన చిత్రా అక్కమ్మ (57) కేసులో మిస్టరీని పోలీసులు ఛేదించారు. ఇద్దరు నిందితులను అరెస్ట్ చేసి, రిమాండ్‌కు తరలించారు. వివరాలను బుధవారం స్థానిక పీఎస్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ధర్మవరం రూరల్ పీఎస్ సీఐ ఎన్.ప్రభాకర్ వెల్లడించారు. రావులచెరువు గ్రామానికి చెందిన చిత్రా అక్కమ్మకు 30 సంవత్సరాల క్రితం మేడాపురం గ్రామానికి చెందిన వ్యక్తితో వివాహమైంది. వీరికి ఇద్దరు కుమారులు, ఓ కుమార్తె ఉన్నారు. దాదాపు 27 ఏళ్ల క్రితం అక్కమ్మ తన భర్త, పిల్లలను వదిలేసి ధర్మవరంలోని తిక్కస్వామి నగర్‌లో అద్దె ఇంటికి మకాం మార్చింది. ఈ క్రమంలో బతుకు తెరువు కోసం కళాజ్యోతి సర్కిల్‌లో వ్యభిచారం సాగిస్తుండేది. గత నెల 16న సాయంత్రం కళాజ్యోతి సర్కిల్‌లో విటుల కోసం వేచి ఉన్న ఆమెను స్థానిక శాంతినగర్‌కు చెందిన ఆటో డ్రైవర్ కట్టుబడి షెక్షావలి, టీచర్స్ కాలనీలోని చౌడమ్మ గుడి వద్ద నివాసముంటున్న తలారి లోకేంద్ర ఆటోలో ఎక్కించుకుని రేగాటిపల్లి పొలాల్లోకి తీసుకెళ్లారు. అక్కడ అక్కమ్మతో లోకేంద్ర లైంగిక కోరిక తీర్చుకుంటున్న సమయంలో ఇద్దరి మధ్య గొడవ జరిగింది. ఆ సమయంలో షెక్షావలి సాయంతో అక్కమ్మ తలపై లోకేంద్ర రాయితో కొట్టి గాయపరిచాడు. అనంతరం తన వద్ద ఉన్న కత్తితో ఆమె గొంతు కోసి హతమార్చాడు. మృతదేహాన్ని ఎవరూ గుర్తు పట్టకుండా ఉండేందుకు కత్తితో ముఖంపై ఉన్న చర్మాన్ని తొలగించి అక్కడ నుంచి ఉడాయించారు. ఘటనపై కేసు నమోదు చేసిన పోలీసులు డీఎస్పీ హేమంత్‌కుమార్ నేతృత్వంలో దర్యాప్తు చేపట్టి పక్కా ఆధారాలతో నిందితులను గుర్తించారు. బుధవారం ఉదయం సీతారంపల్లి వద్ద జాతీయ రహదారిపై తచ్చాడుతున్న షెక్షావలి, లోకేంద్రను గుర్తించి అరెస్ట్ చేశారు. నిందితులపై కేసు నమోదు చేసి, న్యాయమూర్తి ఆదేశాల మేరకు రిమాండ్‌కు తరలించారు. కాగా, నిందితుల అరెస్ట్‌లో చొరవ చూపిన సీఐ ఎన్.ప్రభాకర్, ఎస్‌ఐ శ్రీనివాసులు, కానిస్టేబుళ్లు బాబ్జాన్, రాజప్ప, షాకీర్, అనిల్‌కుమార్, రాఘవేంద్ర, బాలకృష్ణ, హెడ్ కానిస్టేబుల్ చత్రూనాయక్, రామాంజినేయులను ఎస్పీ రత్న, డీఎస్పీ హేమంత్‌కుమార్ అభినందించారు.

నేర పరిశోధనలో జిల్లాకు రెండో స్థానం

- ఎస్పీ రత్నకు అవార్డు అందజేసిన డీజీపీ


డీజీపీ హరీష్‌కుమార్ గుప్త చేతుల మీదుగా అవార్డు అందుకుంటున్న ఎస్పీ రత్న

పుట్టపర్తి టౌన్: నేరాల పరిశోధనలో సాధించిన పురోగతికి సంబంధించి ప్రతి మూడు నెలలకు ఒకసారి రాష్ట్ర పోలీస్ శాఖ ప్రతిష్టాత్మకంగా ప్రకటిస్తున్న ఏబీసీడీ ర్యాంకింగ్‌లో జిల్లాకు రెండో స్థానం దక్కింది. బుధవారం విజయవాడలోని తన కార్యాలయంలో డీజీపీ హరీష్‌కుమార్ గుప్త, సీఐడీ అడిషనల్ డీజీపీ రవిశంకర్, లాఅండ్ ఆర్డర్ ఐజీ మధుసూదన్‌రెడ్డి చేతుల మీదుగా ఎస్పీ రత్నతో పాటు సిబ్బంది సన్మానం అందుకున్నారు. మడకశిర తాలూకా దిన్నేహట్టి గ్రామంలో 1998, అక్టోబర్ 2న తిప్పేస్వామి తన బార్యపై ఉన్న అనుమానంతో అరునెలల బాబు (శివలింగమయ్య)ను గొంతు నులిమి హత మార్చిన విషయం తెలిసిందే. బాబు తల్లి ఫిర్యాదు మేరకు గుడిబండ పోలీసులు కేసు నమోదు చేసినా నిందితుడి ఆచూకీని గుర్తించలేకపోయారు. ఎస్పీ రత్న బాధ్యతలు తీసుకున్న తర్వాత డీజీపీ ఆదేశాల మేరకు పాత కేసుల దర్యాప్తును వేగవంతం చేశారు. ఇందు కోసం ప్రత్యేక బృందాన్ని ఏర్పాటు చేశారు. గత ఏడాది నవంబర్‌లో బాలుడి హత్యపై పల్లె నిద్ర కార్యక్రమంతో ఆరా తీయడంతో కొంత సమాచారం దొరికింది. దీని ఆధారంగా పెళ్లి పత్రిక ఆధారంగా కేసును ఛేదించి నిందితుడిని గుర్తించి అరెస్ట్ చేశారు. 26 ఏళ్ల తర్వాత నిందితుడిని గుర్తించిన ఎస్పీ బృందానికి ఏబీసీడీ ర్యాంకింగ్‌లో రెండో స్థానం దక్కింది. అవార్డు అందుకున్న వారిలో ఎస్పీ రత్నతో పాటు పెనుకొండ సబ్ డివిజన్, మడకశిర సర్కిల్ పోలీసులు ఉన్నారు.

వృద్ధుడి అదృశ్యం



నల్లపరెడ్డి (ఫైల్)

రాప్తాడురూరల్: వాకింగ్ కోసం వెళ్లిన ఓ వృద్ధుడు అదృశ్యమైన ఘటన అనంతపురం రూరల్ మండలం పాపంపేటలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. పాపంపేట శివారులోని ఓవీఆర్ కాలనీకి చెందిన నల్లపరెడ్డి మంగళవారం సాయంత్రం ఇంటి నుంచి వాకింగ్ కోసమని బయటకు వెళ్లాడు. తిరిగి రాలేదు. రాత్రయినా ఇంటికి రాకపోయే సరికి కంగారుపడిన కుటుంబ సభ్యులు సమీప ప్రాంతాల్లో వెతికారు. అయినా లాభం లేకపోయింది. ఈ క్రమంలో బుధవారం కుమారుడు హరినాథరెడ్డి రూరల్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఉపాధ్యాయుడిపై కేసు నమోదు

కదిరి టౌన్: స్థలం పేరుతో మహిళను వంచనకు గురిచేసిన కేసులో ఓ ఉపాధ్యాయుడితో పాటు ఆయన కుమారుడిపై పోలీసులు కేసు నమోదు చేశారు. ఈ మేరకు సీఐ నారాయణరెడ్డి బుధవారం వెల్లడించారు. స్థానిక అడపాలవీధిలో నివాసముంటూ టైలరింగ్‌తో జీవనం సాగిస్తున్న షేక్ భానుకు అదే వీధికి చెందిన ఉపాధ్యాయుడు మేకల ఓబులేసు, ఆయన కుమారుడు కరేజ్‌కుమార్.. స్థలం ఇస్తామంటూ ఆశ చూసి రూ.13 లక్షలు తీసుకున్నారు. అయితే స్థలం ఇవ్వకపోవడంతో తన డబ్బు తిరిగి ఇవ్వాలని ఆమె కోరింది. ఆ సమయంలో ఇద్దరూ బెదిరింపులకు పాల్పడుతూ దౌర్జన్యం చేశారు. ఘటనపై బాధితురాలి ఫిర్యాదు మేరకు ఓబులేసు, ఆయన కుమారుడు కరేజ్‌కుమార్‌పై చీటింగ్ కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

పాఠశాలలో ఆకతాయిల విధ్వంసం


ఆకతాయిలు ధ్వంసం చేసిన స్విచ్ బోర్డు

ఉరవకొండ: స్థానిక 8వ వార్డు పాతపేటలోని మండల పరిషత్ ప్రాథమిక సెంట్రల్ పాఠశాలలో ఆకతాయిలు, తాగుబోతులు మంగళవారం రాత్రి విధ్వంసానికి పాల్పడ్డారు. తొలుత పాఠశాల గ్రౌండ్ ఫ్లోర్‌లోని వరండా ఇనుప గ్రిల్ తలుపును విరగొట్టి లోపలికి ప్రవేశించారు. తరగతి గదిలోని రెండు సీలింగ్ ఫ్యాన్లు తొలగించి పక్కన పడేశారు. అనంతరం విద్యుత్ స్విచ్ బోర్డుతో పాటు నీటి మోటార్‌కు చెందిన స్టార్టర్ బోర్డును పగులగొట్టారు. ఫ్లోరింగ్ టైల్స్ బండరాళ్లతో ధ్వంసం చేశారు. తరగతి గదిలోనే మద్యం తాగి అక్కడే సీసాలు పగులగొట్టి, మూత్ర విసర్జన చేశారు. బుధవారం ఉదయం పాఠశాలకు చేరుకున్న ఉపాధ్యాయులు అక్కడి విధ్వంసాన్ని గుర్తించి ఎంఈఓ ఈశ్వరప్ప దృష్టికి తీసుకెళ్లారు. క్షేత్రస్థాయిలో ఎంఈఓ పరిశీలించిన అనంతరం హెచ్‌ఎం నసీరాబేగంతో కలసి పోలీసులకు ఫిర్యాదు చేశారు.

సీనియర్ సివిల్ జడ్జిల బదిలీ

అనంతపురం: ఉమ్మడి అనంతపురం జిల్లాలోని సీనియర్ సివిల్ జడ్జిలను బదిలీ చేస్తూ బుధవారం ఉత్తర్వులు జారీ అయ్యాయి. అనంతపురం అడిషనల్ సీనియర్ సివిల్ జడ్జి బి. నిర్మలను శ్రీకాకుళం జిల్లా టెక్కలికి బదిలీ చేశారు. హిందూపురం సీనియర్ సివిల్ జడ్జి (సీనియర్ డివిజన్) మణిపాటి శ్రీధర్‌ను శ్రీకాకుళం ప్రిన్సిపల్ సివిల్ జడ్జిగా, ఆయన స్థానాన్ని మదనపల్లి ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జి డి.వెంకటేశ్వర్లు నాయక్‌కు కేటాయించారు. ధర్మవరం సీనియర్ సివిల్ జడ్జి ఎ.గీతావాణి నెల్లూరు జిల్లా కావలికు బదిలీ చేయగా, గుంటూరు జిల్లా రేపల్లె సీనియర్ సివిల్ జడ్జి తమ్మినేని వెంకటేశ్వర్లుకు ధర్మవరానికి బదిలీ చేశారు. కృష్ణా జిల్లా మచిలీపట్నం ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జి ఎ.పద్మను అనంతపురానికి బదిలీ చేశారు. అనంతపురం జిల్లా న్యాయసేవా సంస్థ కార్యదర్శిగా పనిచేస్తున్న జి. శివప్రసాద్ యాదవ్‌ను అనంతపురం అడిషనల్ సీనియర్ సివిల్ జడ్జిగా బదిలీ చేశారు. విజయవాడ చీఫ్ జ్యుడిషియల్ మేజిస్ట్రేట్ ఎస్.రాజశేఖర్‌ను అనంతపురం జిల్లా న్యాయసేవా సంస్థ కార్యదర్శిగా బదిలీ చేశారు.

64 గ్రామాల్లో రక్తపూతలు సేకరించాలి

అనంతపురం మెడికల్: ఉమ్మడి అనంతపురం జిల్లాలో దోమకాటు వ్యాధులు అధికంగా నమోదవుతున్న 32 మండలాల్లోని 64 గ్రామాల్లో ఫైలేరియా వ్యాధిని గుర్తించేందుకు రక్తపూతల సర్వే చేపట్టాలని సంబంధిత అధికారులను డీఐఓ ఓబులు ఆదేశించారు. బుధవారం అనంతపురంలోని డీఎంహెచ్‌ఓ కార్యాలయంలో మలేరియా సబ్ యూనిట్ అధికారులతో ఆయన సమావేశమై దోమకాటు వ్యాధుల నివారణ చర్యలపై సమీక్షించారు. ఈ నెల 25న ప్రపంచ మలేరియా దినంలో భాగంగా ప్రతి పీహెచ్‌సీ పరిధిలో ర్యాలీ, అవగాహన కార్యక్రమాలు చేపట్టాలన్నారు. సమావేశంలో సహాయ మలేరియా సబ్ యూనిట్ అధికారులు మద్దయ్య, మునాఫ్, బత్తుల కోదండ రామిరెడ్డి, తిరుపాల్, నాగేంద్ర ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

యువకుడి బలవన్మరణం

ధర్మవరం రూరల్: కుటుంబ పోషణ భారమై ఓ యువకుడు ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు తెలిపిన మేరకు... ధర్మవరంలోని కేతిరెడ్డి కాలనీకి చంఎదిన బాషా (28), ఫాతిమాబీ దంపతులకు సంతానం లేదు. ఆటో డ్రైవర్‌గా కుటుంబాన్ని పోషించుకునే బాషా... కుటుంబ అవసరాలకు ఇతరుల వద్ద వడ్డీలకు అప్పులు చేశాడు. ఈ క్రమంలో ఆటో ద్వారా వస్తున్న ఆదాయం వడ్డీలు చెల్లించేందుకు కూడా సరిపోయేది కాదు. దీంతో కుటుంబ పోషణ భారమై తీవ్ర మనస్తాపానికి గురైన బాషా... బుధవారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఘటనపై పట్టణ పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.

వృద్ధురాలిని ఏమార్చి చైన్‌స్నాచింగ్

గార్లదిన్నె: వృద్ధురాలిని ఏమార్చి ఆమె మెడలోని బంగారు గొలుసును దుండగుడు అపహరించుకెళ్లాడు. పోలీసులు తెలిపిన మేరకు గార్లదిన్నె మండలం గుడ్డాలపల్లికి చెందిన వృద్ధురాలు నీలావతి బుధవారం మండల కేంద్రంలో కిరాణా సరుకులు కొనుగోలు చేసి స్వగ్రామానికి తిరుగు ప్రయాణమైంది. ఈ క్రమంలో 44వ జాతీయ రహదారిపై గుడ్డాలపల్లి క్రాస్ వద్ద ఆటో కోసం వేచి ఉన్న సమయంలో తలకు హెల్మెట్ ధరించి ద్విచక్రవాహనంపై వచ్చిన యువకుడు వృద్ధురాలి పక్కనే వాహనాన్ని ఆపి తాను కూడా గుడ్డాలపల్లికి వెళుతున్నట్లు నమ్మబలికి ఆమెను ఎక్కించుకుని ముందుకు కదిలాడు. రైల్వే అండర్ పాస్ బ్రిడ్జి వద్దకు చేరుకోగానే వాహనాన్ని ఆపి తనకు ఫోన్‌కాల్ రావడంతో వెనక్కి వెళ్లాల్సి ఉందని తెలపడంతో వృద్ధురాలు కిందకు దిగింది. ఆ సమయంలో ఆమె మెడలోని 5 తులాల బంగారు చైన్‌ను లాక్కొని ద్విచక్ర వాహనంపై వేగంగా జాతీయ రహదారి వైపుగా ఉడాయించాడు. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు ఎస్‌ఐ గౌస్ మహమ్మద్ బాషా తెలిపారు.

హిమోఫీలియా బాధితులు జాగ్రత్తగా ఉండాలి

రాప్తాడురూరల్: హిమోఫీలియా వ్యాధిగ్రస్తులు అత్యంత జాగ్రత్తగా ఉండాలని హిమోఫిలియా బాధితుల సంఘ జిల్లా అధ్యక్షుడు మతం శ్యామ్ సుందర్ శాస్త్రి సూచించారు. బుధవారం ప్రపంచ హిమోఫిలియా దినోత్సవం సందర్భంగా అనంతపురం రూరల్ మండలం పాపంపేటలో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. హిమోఫీలియా వ్యాధిగ్రస్తులకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మద్దతుగా ఉంటున్నాయన్నారు. ఈ వ్యాధిని శాశ్వతంగా నయం చేయడానికి (జీన్ థెరపి) పరీక్షలు జరుగుతున్నాయని తెలిపారు. ఫలితాలు ఆశాజనకంగా ఉన్నట్లు వైద్యాధికారులు చెబుతున్నారని పేర్కొన్నారు. తొందరలోనే శాశ్వత పరిష్కారం దొరుకుతుందనే ఆశాభావం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో హిమోఫీలియా సంఘం సభ్యులు కృష్ణమూర్తి, గణేష్ పాల్గొన్నారు.

కళాశాల సమీపంలో గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం

పెనుకొండ: స్థానిక పరిటాల శ్రీరాములు ప్రభుత్వ డిగ్రీ కళాశాల సమీపంలో గుర్తు తెలియని వ్యక్తి మృతదేహాన్ని స్థానికులు బుధవారం గుర్తించారు. సమాచారం అందుకున్న పోలీసులు అక్కడకు చేరుకుని పరిశీలించారు. 3 రోజుల క్రితం మృతి చెంది ఉంటాడనే అనుమానాలు వ్యక్తమయ్యాయి. మృతదేహాన్ని స్థానిక ప్రభుత్వాస్పత్రిలోని మార్చురీకి తరలించారు. ఘటనపై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టినట్లు పోలీసులు తెలిపారు.

ఆరంభ శూరత్వం

- ప్రహసనంలా మారిన జీజీహెచ్‌లోని మదర్ మిల్క్ బ్యాంక్
- మంత్రి సత్యకుమార్ ప్రారంభించి 10 రోజులవుతున్నా ఆచరణకు నోచుకోని వైనం



మదర్ మిల్క్ బ్యాంకులో ఫ్రీజర్లు, తదితర పరికరాలను ఆన్ చేసి ఉంచిన దృశ్యం

అనంతపురం మెడికల్: కూటమి ప్రభుత్వానికి డైవర్షన్ పాలిటిక్స్ బాగా అచ్చొచ్చినట్లున్నాయి. రోగులకందించే సేవల్లో నాణ్యత పెంచుతున్నట్లు.. గత ప్రభుత్వంలో అవినీతి జరిగిదంటూ ప్రచారం చేసుకొచ్చే ప్రజాప్రతినిధులు ప్రజలను మభ్యపెట్టే పనులకు తెరలేపారు. ఇందుకు నిలువెత్తు నిదర్శనమే ప్రభుత్వ సర్వజనాస్పత్రిలో ఏర్పాటు చేసిన మదర్ మిల్క్ బ్యాంక్. ఈ నెల 7న స్వాక్షాత్తు మంత్రి సత్యకుమార్, ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ చేతుల మీదుగా ఆస్పత్రిలోని మదర్ మిల్క్ బ్యాంక్‌ను ఏర్పాటు చేశారు. సీఎస్‌ఆర్ నిధులకు సంబంధించి తాడిపత్రి అర్జాస్ స్టీల్‌తో రూ.38 లక్షలు, మరో రూ.10 లక్షల ఎంపీ నిధులతో మదర్ మిల్క్ బ్యాంకును ఏర్పాటు చేశారు. ప్రారంభోత్సవ సమయంలో లేని హంగామా సృష్టించి రోగులను ఇబ్బందులకు గురి చేశారు. ఇదెలా ఉన్నా.. కనీసం మదర్ మిల్క్ బ్యాంకు ఆచరణకు అయినా జరుగుతోందా అంటే అదీ లేదు

పది రోజులుగా నిర్మానుష్యం..

పేరు గొప్ప ఊరు దిబ్బ చందంగా మారింది ప్రస్తుతం మదర్ మిల్క్ బ్యాంక్ పరిస్థితి. మంత్రి సత్యకుమార్ చేతుల మీదుగా ప్రారంభమై 10 రోజులవుతున్నా.. ఇంత వరకూ అక్కడ ఎలాంటి పనులు జరగలేదు. పైకి చూసేందుకు మాత్రం అక్కడ పనులు జరుగుతున్నట్లుగా మిషనరీ, ఫ్రీజర్లను ఆన్ చేసి ఉంచారు. దీంతో విద్యుత్ ఖర్చు అధికమవుతోంది. అలాగే ఆటోక్లేవ్ బిన్స్, సుంకు, తదితర సామగ్రి లేదు. బ్యాంక్ కార్యకలాపాల నిర్వహణకు సంబంధించి సిబ్బందికి పూర్తి స్థాయిలో ఎలాంటి శిక్షణ ఇవ్వలేదు. తల్లి పాల ప్రాముఖ్యత, పాలు నిల్వ ఉంచి పిల్లలకు అందించే విషయంపై ప్రజలకు, తల్లులకు ఎలాంటి అవగాహన కల్పించలేదు. కేవలం ప్రజాప్రతినిధుల మెప్పు పొందేందుకు ఆస్పత్రి అధికారులు సైతం అత్యుత్సాహం ప్రదర్శించారు.


తల్లుల నుంచి పాలను తీయడానికి వినియోగించే పరికరాలు


బిన్స్ లేక మూలన పడేసిన ఆటోక్లేవ్